నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, ఆశ్విని హెయిర్ ఆయిల్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో) టమాటా.31, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 48, పందిరి బీర 48, క్యాబేజీ 18, క్యారెట్ 41, దొండ 40, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 26, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఉత్సాహంగా వన మహోత్సవం

సనత్‌నగర్: పచ్చదనంపై హిందూ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కదిలారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విస్తృతంగా మొక్కలు నాటి వాటికి నీరు పోసి కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటి నీరు పోసి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.

బీసీ ఫెడరేషన్ సమితి అధ్యక్షుడిగా శ్రీకాంత్

అడ్డగుట్ట: లంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి సికింద్రాబాద్ అధ్యక్షుడిగా తుకారాంగేట్‌కు చెందిన బాణాల శ్రీకాంత్ చారీ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నాడు.

మార్కెట్ సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ డీబీ దేవేందర్‌తో పాటు కమిటీ సభ్యులు బుధవారం మైనంపల్లిని కలిశారు.

ఈ ఘనత మాదే..

- కంటోన్మెంట్‌లో కారిడార్ పరిహారం మంటలు
- ఇది మావల్లే అంటున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల నేతలు

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం సేకరించిన కంటోన్మెంట్ భూములకు సంబంధించిన పరిహారం సొమ్మును కంటోన్మెంట్ బోర్డుకు కేటాయించడం పట్ల స్థానిక ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న కంటోన్మెంట్‌కు ఏకంగా రూ.303 కోట్లు పరిహారం రూపంలో అందడంతో మౌలిక సదుపాయాలు మెరుగుపరుచుకునేందుకు చక్కటి అవకాశం దక్కింది. కంటోన్మెంట్ కోల్పోయి భూములకు బదులుగానే ఈ నిధులు సమకూరుతున్నప్పటికీ కేంద్రం, రాష్ట్రంలో ఉన్న అధికార బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు గత పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ సైతం ఈ క్రెడిట్ తమదేనంటూ ఎవరికి వారే తమదైన వాదనలు వినిపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలివేటెడ్ ప్రాజెక్టును పట్టాలెక్కించడం వల్లే పరిహారం దక్కిందని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో పాటు కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ప్రతిష్టాత్మక ఈ ప్రాజెక్టును బీఆర్‌ఎస్ పదేళ్ల పాటు మూలన పడేసిందని, ఉచితంగానే భూములు కేటాయించాల్సి ఉండగా, కేంద్రం పరిహారం పేరిట జాప్యం చేస్తూ వచ్చిందన్నారు. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తూ ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులు చేపడుతోందన్నారు. ఇక కేంద్రం రక్షణ భూములు కేటాయించడంతో పాటు పరిహారం సొమ్మును సైతం కంటోన్మెంట్‌కే ఇస్తోందని బీజేపీ నేతలు అంటున్నారు. అసలు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందే తామని బీఆర్‌ఎస్ నేతలు అంటున్నారు. కంటోన్మెంట్ పరిహారాన్నే బోర్డుకు కేటాయిస్తూ బీజేపీ, కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం సరికాదంటున్నారు. ఈ ప్రాజెక్టుల కోసం భూముల కోల్పోతున్న పేదలకు సైతం పరిహారంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి ఎలివేటెడ్ పరిహారం వ్యవహారం కంటోన్మెంట్ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.



కేసీఆర్, కేటీఆర్ కృషి వల్లే..



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఘనత బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌కే దక్కుతుందని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం బోయిన్‌పల్లిలో మాట్లాడుతూ.. సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయం లో ఎస్‌ఆర్‌డీపీ కింద ఎలివేటెడ్ కారిడార్లు మంజూరయ్యాయన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాలయాపన చేయడంతో అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు.

ఉద్యోగులకు ఓయూలో బీటెక్, ఎంటెక్ ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగులకు ఓయూలో బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలో ఈవినింగ్ కొనసాగులు ఈ కోర్సుల్లో ప్రవేశాలకు ఆగస్టు 24 (ఆదివారం)న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 11 వరకు, రూ.2000 అపరాధ రుసముతో ఆగస్టు 6 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

రవికుమార్‌కు ఓయూ డాక్టరేట్



రవికుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థి బానోతు రవి కుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.బీవీ రమణ మూర్తి పర్యవేక్షణలో యాన్ ఎఫిషియంట్ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ క్రాప్, యాల్డ్ యూజింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ పట్టాను సాధించాడు. భువనగిరి జిల్లా రావిపహాడ్ తండాకు చెందిన రవికుమార్ వివిధ రంగాల్లో పని చేసిన్నట్లు తెలిపారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

లాలాపేట: పెట్టుబడి దారుల ప్రయోజనం కోసం కార్మికులను బలి చేసే 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలనీ ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల బెజ్జాల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో కృష్ణమూర్తి, తార్నాక డివిజన్ కార్యదర్శి సయ్యద్ గౌస్ ఆధ్వర్యంలో పలువురు పాల్గొన్నారు.

ఇది ముమ్మాటికీ మా విజయమే : బీజేపీ



బోర్డు మాజీ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన పరిహారం సొమ్ము కంటోన్మెంట్‌కు దక్కడం ముమ్మాటికీ బీజేపీ విజయమేనని బోర్డు మాజీ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. బుధవారం మహేంద్రాహిల్స్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాను బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలోనే ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన అంశంపై బోర్డులో తీర్మానం చేశామన్నారు. 24 కంటోన్మెంట్ భూములకు సంబంధించిన రూ.303 కోట్ల పరిహారం సొమ్ము కేంద్ర ప్రభుత్వ కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ)లో జమ అయ్యేదన్నారు. అయితే ఈ సొమ్మును పరోక్షంగానైనా బోర్డుకే కేటాయించాల్సిందిగా తాను బోర్డులో తీర్మానం చేయించానన్నారు. ఇక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్‌ల ద్వారా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు పలుమార్లు లేఖలు రాశామన్నారు.

బీజేపీ రాజకీయం సిగ్గుచేటు :ఎమ్మెల్యే శ్రీగణేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: ఎలివేటెడ్ కారిడార్ల పరిహారం కంటోన్మెంట్‌కు దక్కడం తమ ఘనతేనని బీజేపీ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బుధవారం పికెట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ 13 నెలల తన పదవీ కాలంలో కనీసం 13 రూపాయలు కూడా కంటోన్మెంట్‌కు కేటాయించలేకపోయాడన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరాక ముఖ్యమంత్రి చొరవ వల్లే పదేళ్లుగా మూలన పడ్డ ఎస్‌ఆర్‌డీపీ ప్రాజెక్టు ఓ కొలిక్కి వచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణలో భాగంగానే కంటోన్మెంట్ బోర్డు కోల్పోనున్న 24 ఎకరాలకు సంబంధించి రూ.303 కోట్లు పరిహారం చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఈ సొమ్మును సైతం తమ ఖాతాలో వేసుకునేందుకు కేంద్రం ప్రయత్నించిందన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం ఉచితంగానే భూములు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. అయినప్పటికీ 129 ఎకరాల రక్షణ భూములకు బదులుగా, 400 ఎకరాలు తీసుకోవడంతో పాటు కంటోన్మెంట్‌కు దక్కాల్సిన పరిహారాన్ని సైతం తమకే కావాలనడం దారుణమన్నారు.

ప్రకాష్‌నగర్ బస్తీలో విద్యుత్ అధికారుల పర్యటన

సనత్‌నగర్: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ ఉన్నతాధికారులు బుధవారం బేగంపేట ప్రకాష్‌నగర్ బస్తీల్లో పర్యటించారు. విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ) కరుణాకర్‌బాబు, గ్రీన్‌ల్యాండ్స్ ఆపరేషన్స్ ఏడీఈ బీమానాయక్, బేగంపేట ఏఈ సాయికిరణ్ తదితరులు బస్తీలో పర్యటించి స్థానిక సమస్యలను ఆరా తీశారు. విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్నాయని, ఇళ్లకు అతి సమీపంలో తీగలు ఉండడంతో భయాందోళనకు గురవుతున్నామని పలువురు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వర్షాకాలంలో ఇళ్ల గోడలకు కూడా కరెంటు షాక్ వస్తుందని ఫిర్యాదు చేశారు. దీంతో తాము భయాందోళనలకు గురవుతున్నామని వాపోయారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తామని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ లోని మహబూబ్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై బుధవారం అవగాహన కల్పించారు. బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నార్త్ జోన్ ఏసీపీ జి. శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి అని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లైక్స్, వ్యూస్ కోసం బైకుల మీద స్టంట్స్ చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని వెల్లడించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, మహంకాళి ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ పాల్గొన్నారు.

మహాగర్జనకు మద్దతివ్వండి



బన్సీలాల్‌పేట్: ఆగస్టు 13న జరిగే పెన్షన్ దారుల మహాగర్జనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఎమ్మెల్యే టి. పద్మారావుకు విజ్ఞప్తి చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి హైద్రాబాద్ జిల్లా ఇంఛార్జి అందే రాంబాబు అధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం మోండా మార్కెట్ డివిజన్ టకారబస్తీలో ఎమ్మెల్యే టి. పద్మారావుకు వినతి పత్రం సమర్పించారు.

పీహెచ్‌డీ ప్రవేశాలలో బీసీలకు న్యాయం చేయండి



వీసీకి వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలలో బీసీ విద్యార్థులకు న్యాయం చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు వీసీ ప్రొ.కుమార్‌కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. పీహెచ్‌డీ సీట్ల కేటాయింపు ప్రక్రియలో అనేక లోపాలు ఉన్నాయని దీన్ని వల్ల బీసీ విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. వివిధ కాలేజీలోన్ని కోర్సుల వారిగా ఆయా డిపార్టుమెంట్లులో 10 కంటే ఎక్కువ సీట్లు ఉన్నప్పుడు మాత్రమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోటాను అమలు చేయాలని వీసీకి వివరించిన్నట్లు తెలిపారు. బీసీలకు అన్యాయం జరగకుండ పీహెచ్‌డీ అడ్మిషన్స్ సీట్ మ్యాట్రిక్స్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి నేతలు జంపాల రాజేష్, బొల్లెపల్లి స్వామిగౌడ్ పాల్గొన్నారు.

ఓయూలో ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఏబీవీపీ ఆవిర్భావం సందర్భంగా ఓయూలో ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని జరుపుకున్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట జరిగిన కార్యక్రమానికి ఏబీవీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఓయూ ఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొ. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ఏబీవీపీ జెండాను ఎగురవేసి మాట్లాడారు. అనంతరం ఏబీవీపీ నాయకులు కమల్ సురేష్, దృహన్ మాట్లాడారు. కార్యక్రమంలో శివకుమార్, హరిప్రసాద్, శేఖర్, నరేందర్ పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్స్, టైపిస్టులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎమ్మెల్యే తలసానికి సమస్యలు వివరిస్తున్న స్టాంప్ వెండర్లు

సనత్‌నగర్: తమకు జీవినాధారం లేకుండా చేశారని, తమ కుటుంబాలను ఆదుకోవాలని స్టాంప్ వెండర్స్, టైపిస్టులు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఎదుట తమ ఆందోళన వ్యక్తంచేశారు. సికింద్రాబాద్ కోర్టు వద్ద ఫుట్‌పాత్‌పై ఎన్నో సంవత్సరాల నుంచి స్టాంప్ వెండర్స్‌గా, టైపిస్టులుగా జీవనం సాగిస్తున్న బాధితులు బుధవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. అనేక సంవత్సరాల నుంచి కోర్టు వద్ద ఫుట్‌పాత్‌లపై పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, కానీ తమను నిర్దాక్షిణ్యంగా ఫుట్‌పాత్‌లపై నుంచి ఖాళీ చేయించారని వివరించారు.

మొక్కల పరిరక్షణపై దృష్టి సారించాలి

సనత్‌నగర్: చిన్నపిల్లల ఆలనాపాలనను ఏవిధంగా చూసుకుంటామో మొక్కలను నాటి వాటి పరిరక్షణను చూసుకోవాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్‌లోని పలు పార్కుల్లో మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో హరితసేన రాష్ట్ర కో–ఆర్డినేటర్ గర్రెపల్లి సతీష్, ఆర్‌సీ పటేల్, పురుషోత్తం, టింకు, నందు, రుక్మిణిరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

లష్కర్ బోనాలను ప్రశాంతంగా జరుపుకుందాం

సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ సూచించారు. బోనాల జాతర కోసం ప్రభుత్వం నియమించిన 12 మంది సభ్యులతో కూడిన బృందం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ఇందుకోసం ఆలయాలకు ప్రత్యేక నిధులు కూడా కేటాయించిందని పేర్కొన్నారు. గంటా గీత, ఠాకూర్ హేమంత్‌సింగ్, కృష్ణ, పాండురంగం, రాకేష్ అగర్వాల్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

అమీర్‌పేట: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అమీర్‌పేట ధరం కరం రోడ్డులోని మున్సిపల్ మైదానంలో తలసాని యువసేన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సోదరుడు తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ప్రతి రోజూ క్రీడలకు కొంత సమయం కేటాయిస్తే శారీరకంగా,మానసికంగా ధృడంగా తయారవుతారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు హనుమంత్‌రావు, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయ పోరాటానికి సిద్ధం కావాలి

మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కాసాని జ్ఞానేశ్వర్

బన్సీలాల్‌పేట్: ముదిరాజ్ కులస్తులు తమ మనుగడ కోసం రాజకీయ పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. బోయిగూడ ముదిరాజ్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ముదిరాజ్ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు తమ సత్తా చాటాలన్నారు. రాజకీయంగా అభివృద్ధి చెందడానికి ముదిరాజ్ కులస్తులు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

చైన్ లాక్కొని పరార్

అమీర్‌పేట: స్నేహితురాలి వద్దకు వెళ్తున్న ఓ మహిళ మెడలోని చైన్‌ను అగంతకుడు లాక్కొని పరారయ్యాడు. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. దాసారం బస్తీకి చెందిన సుజాత అనే మహిళ బుధవారం మధ్యాహ్నం నడుచుకుంటూ వెళుతుండగా బీకేగూడ మసీదు వద్ద పల్సర్‌పై వచ్చిన ఓ అగంతకుడు ఆమె మెడలో ఉన్న 5 తులాల పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడు.

కల్లు కాంపౌండ్లపై ఎక్సైజ్ పోలీసుల దాడి

సనత్‌నగర్: కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి పలువురు మృతి చెందిన నేపథ్యంలో ఎక్సైజ్ పోలీసులు బుధవారం సాయంత్రం సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్లు కాంపౌండ్లపై దాడుల నిర్వహించారు. సనత్‌నగర్ స్వామి కాంప్లెక్స్ సమీపంలోని కల్లు కాంపౌండ్‌పై గతంలోనే పలు ఫిర్యాదులు ఉండడంతో పోలీసులు కాంపౌండ్‌లో తనిఖీలు జరిపారు. కల్లులో కలిపే మత్తు పదార్థాల గురించి ఆరా తీశారు. కల్లు పరీక్షలు నిర్వహించారు. ఎర్రగడ్డ, బోరబండ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్స్‌లో కూడా దాడులు చేశారు. కల్లు శాంపిళ్లను సేకరించారు. ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు రాధ, వాణి దాడుల్లో పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



లాలాపేట: వన మహోత్సవం కార్యక్రమం బుధవారం తార్నాక మున్సిపల్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. తార్నాకలోని నాగార్జునగర్ పార్కులో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అన్నారు. టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, టి. తిరుపతిరావు, జలంధర్‌రెడ్డి, తార్నాక వాసులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: అప్పుల బాధ తాళలేక మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల మేరకు... మనోహరబాద్‌లోని కూచారం గ్రామానికి చెందిన డప్పు ప్రవీణ్‌కుమార్(25) ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం తండ్రి మరణించడంతో తల్లితో పాటు ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అప్పులు చేశాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రవీణ్ బుధవారం ఉదయం మద్యం మత్తులో మేడ్చల్ – మనోహరబాద్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

లేబర్ కోడ్స్‌తో కార్మికుల ఇబ్బందులు

అడ్డగుట్ట: కార్మికులు, కర్షకులు, వృత్తిదారులు దేశవ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం ఉదయం తుకారాంగేట్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జోన్ కన్వీనర్ ఆర్. మల్లేష్ మాట్లాడుతూ. ఎన్నో ఏండ్లుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చారని, వాటి వలన కార్మికులు అనేక ఇబ్బందులు పడతారన్నారు. సమావేశంలో నాయకులు గోపాల్, మల్లయ్య, ఎల్లయ్య, రాజు, రామ్ చందర్, యాదయ్య, రాములు, బిక్షపతి , మంగమ్మ, యాదమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహన కల్పించిన విద్యార్థులు

సనత్‌నగర్: ఉన్నత్ భారత్ అభియాన్ (యూబీఏ) కార్యక్రమంలో భాగంగా బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల విద్యార్థులు సంగారెడ్డి జిల్లాలోని తండాలను సందర్శించి అక్కడి విద్యార్థులు, గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. కళాశాల నుంచి 53 మంది విద్యార్థినులు, ఐదుగురు అధ్యాపకులు హాజరై ఇప్పలగడ్డ, కండి తండాల్లో పర్యటించి అక్కడి వారితో మమేకమయ్యారు. పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కలిగించారు. గృహహింసపై ప్రజ్ఞాపూర్వక నాటకాలు ప్రదర్శించి వారిలో చైతన్యాన్ని కలిగించే ప్రయత్నం చేశారు.

నిధులు మంజూరైన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



అమీర్‌పేట: అమీర్‌పేట నాలా విస్తరణను ట్రాన్స్ ఫార్మర్లు అడ్డుగా ఉన్నాయని, నిధులు వచ్చిన వెంటనే ట్రాన్స్ ఫార్మర్లు వేరే చోటుకు మారుస్తామని ట్రాన్స్ కో డివిజనల్ ఇంజనీర్ భీమానాయక్ తెలిపారు. గాయత్రీనగర్‌లో బుధవారం డీఈ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ట్రాన్స్ ఫార్మర్లు ఉన్న కారణంగా నాలా విస్తరణ పనులు నిలిచి పోయాయని ప్రజలు వివరించారు. డీఈ మాట్లాడుతూ రెండు ట్రాన్స్ ఫార్మర్లు వేరే చోటుకు మార్చాల్సి ఉందని,అయితే కావాల్సిన నిధుల కోసం జీహెచ్ఎంసీ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.